ప్రజాశక్తి

సోమవారం 22 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





ఉపాధి.. రూ.200తో సరి..!

- రోజు కూలి గిట్టుబాటు కావడం లేదని పలువురు ఆవేదన
- పనుల్లో 60 ఏళ్లు పైబడిన మహిళలే అధికం
- పలుచోట్ల పట్టభద్రులూ కూలీలే
- విశాఖ గ్రామీణ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువు



భీమిలి మండలంలో ఉపాధి హామీ పనులు చేపడుతున్న మహిళా కూలీలు



ఉపాధి పనుల్లో విద్యార్థులు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం విశాఖ జిల్లాలో సరిగా అమలుకావడం లేదు. పనుల కోసం గ్రామాల్లో ప్రజలు అర్రులు చాస్తున్నారు. కనీస కూలి రూ.273 రావాల్సి ఉండగా పలుచోట్ల రూ.200తోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో నిత్య జీవన అవసరాలు తీరడం లేదు. ఫలితంగా కూలీలు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. ఉన్న ఊర్లోనే పొట్టపోసుకోవడానికి ఉద్దేశించిన ఈ చట్టం కేంద్ర ప్రభుత్వ తీరుతో ఆసరాగా నిలవడం లేదన్న విమర్శలు అధికమవుతున్నాయి. కనీస నిబంధనలన్నింటికీ కేంద్రంలోని బిజెపి సర్కారు పాతరేస్తోంది. తాగునీరు, టెంట్లు వంటి కనీస సౌకర్యాలూ కల్పించడం లేదు. 'పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, పార, పలుగు వంటివి పదేళ్ల కిందటి మాట' అంటూ సింగనబంద ప్రాంతానికి చెందిన కర్బోతి పైడమ్మ, పోతల ఆదిలక్ష్మి, దాకమర్రి అచ్చియమ్మ, పాపయ్య, సత్యవతి 'ప్రజాశక్తి'కి తెలిపారు.

మండుటెండలైనా పొట్టకూటికోసం వెళ్తున్నాం..

రోజువారీ అవసరాలు తీరాలంటే కనీసం రోజుకు రూ.300లైనా లేకపోతే ఎలా ? అంటూ ఉపాధి కూలీలంతా ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని భీమునిపట్నం మండలం సింగనబంద, మామిడిబంద చెరువుల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను 'ప్రజాశక్తి' పలకరించగా వారు తమ కష్టాలను చెప్పుకొచ్చారు. గడచిన నెల రోజులుగా ఎండలు మండిపోవడంతో మట్టి తవ్వలేకపోతున్నామని, ఎక్కువ సమయం పని ప్రదేశంలో ఉండలేక వడదెబ్బకు గురవుతున్నామని తెలిపారు. వాటర్ బాటిళ్లలో తాము తెచ్చుకున్న నీళ్లగంటలోనే అయిపోతున్నాయని. పని ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలూ మిగతా 2లో..



సత్తిబాబు అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజానీకం

ఉద్యమ నేత సత్తిబాబుకు ఘన వీడ్కోలు

- వందలాది మంది కార్మికులు, ప్రజలు హాజరు
- ఆయన ఆశయ సాధనకు కృషి
- సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి – నర్సీపట్నం టౌన్

పోరాట యోధులు, నిత్య కృషీవలురు దుంపలపూడి సత్తిబాబు ఏ ఆశయం కోసమైతే పని చేశారో అదే ఆశయ సాధనకు తామంతా పనిచేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.సత్తిబాబు అంతిమ వీడ్కోలు సందర్భంగా ఆదివారం నర్సీపట్నంలో జరిగిన సంతాప సభలో లోకనాథం మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, ప్రజల సమస్యల పరిష్కారానికి సత్తిబాబు శక్తి వంచన లేకుండా పనిచేశారని, తామూ ఆ పనినీ కొనసాగిస్తామని, అందుకు నర్సీపట్నం ప్రజానీకం సహకరించాలని కోరారు. సత్తిబాబు ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు మేకా సూరిబాబు ప్రేరణతో.. తన తండ్రి స్ఫూర్తితో చిన్న వయసులోనే మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

వార్త మెయిన్‌లో..

ప్లాస్టిక్ వ్యర్థాలతో తీర ప్రాంతాలు కలుషితం

వార్త 2లో..

యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలపై నేడు సమావేశం

వార్త 2లో..



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు

ఎల్ఐసిని కార్పొరేట్లకు దోచిపెడితే ఊరుకోం

ఎల్ఐసి ఎఓఐ సౌత్ జోనల్ మహాసభలో వక్తలు

వార్త మెయిన్‌లో..

వ్యవసాయాభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు

- రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటాం
- అనకాపల్లి జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు మోహన్‌రావు



ప్రజాశక్తి – అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు మోహన్‌రావు వెల్లడించారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పుకొచ్చారు. జిల్లాలోని వ్యవసాయ రంగ పరిస్థితి, ఎరువులు, విత్తనాల స్థితి, ప్రభుత్వ పథకాల వివరాలను ఆయన 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..

ఈ - పంట, ఇకెవైసి నమోదు ఎలా సాగుతోంది ?

2022 ఖరీఫ్‌కు ఈ – పంట కింద 1,27,799 హెక్టార్లు నమోదైంది. వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్నాం. అయితే ఇకెవైసి మాత్రం 92 శాతం మందే చేయించుకున్నారు. 2022 – 23 రబీలో 17441 హెక్టార్ల విస్తీర్ణానికి వంద శాతం నమోదు జరిగింది. ఇకెవైసి 99.4 శాతం జరిగింది.

జిల్లాలో వర్షపాత నమోదు ఆశాజనకంగా ఉందా ?

జిల్లాలో సాధారణ వర్షపాతం 1081 మిల్లీమీటర్లుకాగా ఇంతవరకు 1146 మిల్లీమీటర్లు నమోదైంది. 5.9 శాతం అధికంగా ఉంది.

రైతులకు అందిస్తున్న వివిధ పథకాలను వివరించండి ?



జిల్లాలో రైతులకు డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ ఉత్పత్తుల పథకాలు అందిస్తున్నాం.

విత్తనాలు, ఎరువుల సరఫరా ఎలా ఉంది ?

2022 ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా కేంద్రాల ద్వారా 1,017 క్వింటాళ్లు పచ్చిరొట్ట, 20,215 క్వింటాళ్ల వరి విత్తనాలను సరఫరా చేశాం. 2023 ఖరీఫ్ సీజన్‌కు 24947 క్వింటాళ్ల విత్తన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉపాధి.. రూ.200తో సరి..!

ఉండటం లేదని 60 ఏళ్ల కూలీ రామస్వామి, గర్భోతు పైడిరాజు, ఈశ్వరరావు, పోతల రాజు, రావాడ రాము, కృష్ణమ్మ, ఆదిలక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలో మాడి మసైపోతున్నా మంచినీళ్లు ఇచ్చేవారే లేరని, కనీస సదుపాయాలు లేకపోతే ఎలా ? అని రామస్వామి ప్రశ్నించాడు. సింగనబంద, మామిడిబంద చెరువుల్లో ఉపాధి పనుల్లో అత్యధిక మంది 60 ఏళ్లు వచ్చిన వాళ్లే ఉన్నారు. 'శరీరంలో సత్తువ లేకపోయినా బతకడం కోసం శరీరాన్ని కూడదీసుకుని కూలికొస్తున్నాం బావూ..' అంటూ మహిళలంతా ఆవేదనతో చెప్పుకొచ్చారు. ఏడు రోజులకోసారి తమ అకౌంట్లలో రూ.1000 లేదా రూ.1200 చేసిన పనిని బట్టి వస్తున్నాయని వీరంతా వెల్లడించారు. సుమారు 150 ఎకరాల సాగు పంటలకు తోడ్పడే 30 ఎకరాల్లో విస్తరించిన 2 చెరువులకు గట్లు కట్టే పనిలో ఈ కూలీలంతా నెలల తరబడి నిమగ్నమై పనులు చేస్తున్నారు.

పనుల్లో బిటెక్ కంప్యూటర్ సైన్స్, డిగ్రీ విద్యార్థులు

సింగనబంద గ్రామంలోని చెరువులో గౌరీశంకర్ అనే విద్యార్థి 'ప్రజాశక్తి'కి కనిపించాడు. బిటెక్ (కంప్యూటర్ సైన్స్) మూడో సంవత్సరాన్ని అవంతి కాలేజీలో అతడు చదువుతున్నాడు. ఆ పక్కనే డిగ్రీ విద్యార్థి గాడు రాజు ఉపాధి పని చేస్తూ కనిపించాడు. మూడేళ్ల కిందట తాము కూలి పనుల్లో చేరామని, ఇంట్లో గడవక ఈ పని కొనసాగిస్తున్నామని, వేరే గత్యంతరం లేదని వారు తెలిపారు. భీమిలి, ఆనందపురం ఉపాధి హామీ చట్టం ఎపిఒలైన జి వెంకటగౌరి, అప్పలరాజు అందించిన సమాచారం ప్రకారం భీమిలిలో జాబ్ కార్డులు 3750 ఉండగా కూలీలు 5020 మంది పనిచేస్తున్నారు. 35 మంది బిటెక్, డిగ్రీ చదువుతున్న వారు పనుల్లో ఉన్నారని జి.వెంకటగౌరి తెలిపారు. ఆనందపురం మండలంలో 9700 మంది కూలీలకు 8 వేల మంది పనిచేస్తున్నారు. వీరిలో బిటెక్ హోల్డర్లు 14 మంది, బిఇడి వారు ఆరుగురు, డిగ్రీ చదువుతున్న వారు 80 మందికిపైనే ఉన్నారు.

ఉద్యమ నేత సత్తిబాబుకు ఘన వీడ్కోలు

వామపక్షవాదిగా మారారన్నారు. మూడు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో సిపిఎంలో సాధారణ కార్యకర్త నుంచి జిల్లా నాయకునిగా ఎదిగారన్నారు. పార్టీలోనూ, ప్రజా సంఘాలలోనూ అనేక బాధ్యతలు నిర్వహించారన్నారు. కర్తవ్య నిర్వహణలో ఆయన తుది శ్వాస వదిలారన్నారు, మేకా సూరిబాబు ద్వితీయ కుమార్తె శారదను సత్తిబాబు కులాంతర వివాహం చేసుకొని ఆదర్శంగా నిలిచారన్నారు. పార్టీ పట్ల, ప్రజల పట్ల ఎంత బాధ్యతగా వ్యవహరించారో కుటుంబం పట్ల కూడా అంతే బాధ్యతగా వ్యవహరించారని అన్నారు. తన ఇద్దరు కుమారులను ప్రయోజకులను చేశారని, సత్తిబాబు మరణం తీరని లోటని అన్నారు. సత్తిబాబు ఆఖరి క్షణం వరకూ అట్టడుగు ప్రజల కోసమే పాటుపడ్డారని అన్నారు. ఆయన ఎన్ని బాధలున్నప్పటికీ చిరునవ్వుతోనే సమాధానం ఇస్తూ అందరినీ పలకరించేవారని అన్నారు. రాజకీయాలు చేసే నేతలను మనం చూస్తున్నామని.. వారికి భిన్నంగా సత్తిబాబు కేవలం ప్రజా శ్రేయస్సుకే పాటుపడ్డారని తెలిపారు. ఇతర రాజకీయ నేతల మాదిరి సంపాదనలో ఎదగలేదని, నీతీ నిజాయితీగా తన జీవితాన్ని ముగించారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ సత్తిబాబు మరణం చాలా బాధాకరమని అన్నారు. ఆయన వామపక్ష భావజాలంతో నిరంతర పోరాటం చేశారని, కార్మికులు, కూలీల శ్రేయస్సు కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ సత్తిబాబు వామపక్షవాదిగా, ఉద్యమ నేతగా తన జీవితాన్ని ముగించారని, నర్సీపట్నం కేంద్రంగా సుమారు మూడు దశాబ్దాలుగా ఆయన అనేక సంఘాలు ఏర్పాటు చేసి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగారని అన్నారు. పార్టీలకతీతంగా ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాటు పడ్డారన్నారు. సత్తిబాబు స్నేహితులు దలే సత్యనారాయణ మాట్లాడుతూ సత్తిబాబుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఎం జిల్లా నాయకులు ఎ.బాలకృష్ణ, సత్తిబాబు సోదరులు డి.నూకరాజు అడ్వకేట్ ప్రకాష్ మాట్లాడారు. సత్తిబాబు నిత్య పోరాటశీలి అని కొనియాడారు.

పలువురు నివాళి

సత్తిబాబు పార్థివ దేహాన్ని పట్టణానికి చెందిన పలు పార్టీల నేతలు, ప్రజలు సందర్శించి నివాళ్లర్పించారు. డిసిసిబి చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసి పాత్రుడు దంపతులు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, నాయకులు వివి.శ్రీనివాసరావు, ఆర్.రాము, ఎ.రాజు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనకాపల్లి జిల్లా నాయకులు కె.గోవిందరావు, దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి, పలు సంఘాల నాయకులు ప్రసన్న, నానాజీ, సాపిరెడ్డి నారాయణమూర్తి, కెవి.సూర్యప్రభ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు సత్తిబాబుకు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు.

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

సత్తిబాబు అంతిమ యాత్ర అశ్రునయనాల మధ్య సాగింది. జిల్లా నలుమూలల నుంచి సిపిఎం, సిఐటియు, పలు ప్రజా సంఘాల నాయకులు, ముఠా, మున్సిపల్ కార్మికులు, ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం తదితర రంగాల కార్మికులు భారీగా తరలివచ్చి సత్తిబాబుకు ఘనంగా అంతిమ వీడ్కోలు పలికారు. సత్తిబాబు భౌతికకాయాన్ని ఆయన ఇంటి నుంచి నర్సీపట్నం పురవీధులు గుండా ఊరేగింపుగా బలిఘట్టం శ్మశాన వాటిక వరకూ తీసుకెళ్ళి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. 'కామ్రేడ్ సత్తిబాబు అమర్ రహే, సాధిస్తాం సత్తిబాబు ఆశయాలను, జోహార్.. కామ్రేడ్ సత్తిబాబు' నినాదాలు పట్టణంలో మార్మోగాయి. ప్రజానాట్యమండలి నాయకులు ఎం.చంటి సత్తిబాబును స్మరిస్తూ గీతాలాపన చేశారు.

వ్యవసాయాభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు

సరఫరాను లక్ష్యంగా చేసుకున్నాం. పచ్చిరొట్ట 50 శాతం రాయితీపై, జనుము కిలో 42, జీలుగు 39.5, పిల్లి పెసర 48.5, వేరుశనగ విత్తనాలను 40 రాయితీపై అందిస్తున్నాం. ఎరువులకు సంబంధించి 2022 ఖరీఫ్‌లో 31 వేలా 821 మెట్రిక్ టన్నులు, రబీలో 21 వేలా 665 మెట్రిక్ టన్నులు సరఫరా చేశాం. 2023 ఖరీఫ్‌కు 35 వేలా 355, రబీ సీజన్‌కు 19198 మెట్రిక్ టన్నుల సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆర్‌బికెల ద్వారా 2023 ఖరీఫ్‌కు 13196 మెట్రిక్ టన్నుల సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నాం.

జిల్లాలో ధాన్యం సేకరణ ఎలా ఉంది ?

2022 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 32 వేలా 567 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. రబీ సీజన్‌లో ఆరు మండలాల నుంచి 825 మెట్రిక్ టన్నులు సేకరణ చేయాల్సి ఉండగా ఇంత వరకు రాంబిల్లి మండలం నుంచి 41 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం.

రైతాంగానికి అందించే ఇన్‌పుట్ సబ్సిడీ ఎలా ఉంది ?

2022 డిసెంబర్‌లో వచ్చిన తుఫానుకు ఏడు మండలాల్లో 499 మంది రైతులకు సంబంధించి 107.51 హెక్టార్లలో పంట నష్టపరిహారం అందించాం. మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలకు నాలుగు మండలాల్లో 166.54 హెక్టార్లలో 681 మంది రైతుల వరి, నువ్వు పంటలకు నష్టం జరిగింది. 11 లక్షలా 35 వేల రూపాయల నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపాం. వ్యవసాయ యంత్ర సేవా పథకం కింద జిల్లాలో 450 ఆర్‌బికెలకు కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఇంతవరకు 272 గ్రూపులకు 676.92 లక్షల రాయితీ అందించాం. అలాగే మెగా మేళాలో భాగంగా 157 ట్రాక్టర్లు అందించాం. 2023- 24 సంవత్సరానికి 158 గ్రూపులు లక్ష్యం కాగా 143 గ్రూపుల పనిముట్లు ఖరీదులో 50 శాతం నగదు జమచేశాం.

డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పనితీరు ఎలా ఉంది ?

రైతులకు నాణ్యత ధ్రువీకరించిన విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. ఇప్పటికే అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో ప్రారంభించాం. మాడుగుల, యలమంచిలి, పాయకరావుపేట, సబ్బవరం నియోజకవర్గాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇంతవరకూ జిల్లాలో 369 విత్తన నమూనాలు, 249 ఎరువుల నమూనాలు పరీక్షించాం.

ప్లాస్టిక్ వ్యర్థాలతో తీర ప్రాంతాలు కలుషితం

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంతో సముద్రతీర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని, అలాకాకుండా సముద్ర తీర ప్రాంతాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, స్వచ్ఛత జన్‌భాగీదారి, సాగరతీర స్వచ్ఛత ఇండియా జి-20 ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో మెగా బీచ్ క్లీన్ అప్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం 6 గంటలకు రామకృష్ణా బీచ్ నుంచి వైఎంసిఎ వరకు తీర ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థతో కలిసి బీచ్ క్లీనింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ దిశగా అందరూ నడవాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు దేశంలోని సముద్ర తీరాలను శుభ్ర పరచడంలో భాగంగా ఆదివారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో కలిసి విశాఖ సాగరతీరంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సాగర తీరంలో వ్యర్థాలను జివిఎంసి డస్ట్‌బిన్లలో పడేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ శ్రీధర్, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ విద్యాసాగర్ నాయుడు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇఇ పి.ప్రసాద్, ఎస్ఇ నాగార్జున, ఇఇపి శ్రీనివాసరావు. నేవీ, కోస్ట్ గార్డ్, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ నిర్వహించారు.

అనంతరం బీచ్‌లో వివిధ సంస్థల యాజమాన్యాలు ఏర్పాటు చేసిన ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ స్టాల్స్, శాండ్ ఆర్ట్‌లను అతిథులు సందర్శించారు.

యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలపై నేడు సమావేశం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

రాష్ట్రంలో యూనివర్సిటీ బోధనేతర సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వలే 62 సంవత్సరాలు ఉద్యోగ విరమణ వయసును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జగదాంబ వద్దగల సిఐటియు కార్యాలయంలో ఉదయం 9 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరవుతారని, వీరితోపాటు సిఐటియు, టిఎన్‌టియుసి, ఎఐటియుసి, సిఎఫ్‌టియుఐ, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని చెప్పారు.

యూనివర్సిటీలో ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఒకటో తేదీకే చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగులపై వేధింపులు ఆపాలని, ఉద్యోగ విరమణ వెంటనే రావలసిన బెనిఫిట్స్ చెల్లించాలని ఉద్యోగులంతా డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జరిగే సమావేశంలో యూనివర్సిటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కెకె లైన్‌లో రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్‌లోని కెకె.లైన్‌లో ఎస్.కోట-బొడ్డవర స్టాటోయిన్ల మధ్య ప్రీ-నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్, 08551 విశాఖపట్నం-కిరండూల్ ప్యాసెంజర్ స్పెషల్, 18512 విశాఖపట్నం-కోరాపుట్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 08546 విశాఖపట్నం-కోరాపుట్ ప్యాసింజర్ స్పెషల్ రైళ్ళను మే 22న రద్దు చేశారు. 08552 కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 18511 కోరాపుట్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 08545 కోరాపుట్-విశాఖపట్నం ప్యాసింజర్ ప్రత్యేక రైళ్ళను మే 23న రద్దు చేశారు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి విజ్ఞప్తి చేశారు.



యోగా శిక్షణ పొందిన వారితో డిఆర్ఎం అనుప్ సత్పతి

యోగా శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు పారిజాత సత్పతి మార్గదర్శకత్వంలో ఈ నెల 15 నుంచి యువత కోసం నిర్వహిస్తున్న యోగా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ వారం రోజులూ ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. ముగింపు శిబిరానికి ముఖ్య అతిథిగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి హాజరై కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. యోగా గురువులను సత్కరించారు. రోజుకు 12 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సుగల 150 మంది యువకులు ఈ మెగా యోగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పారిజాత సత్పతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో సీతమ్మధార స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను సోమవారం సాయంత్రం 4:00 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీతమ్మధార ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు.

పిఎంపిఇజెఎఫ్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో నూతనంగా ప్రారంభించిన ప్రింట్ మీడియా పబ్లిషర్స్, ఎడిటర్స్, జర్నలిస్టు ఫెడరేషన్ లోగోను ఆదివారం మంత్రి అమర్‌నాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా రంగంలో పబ్లిషర్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు సూర్య భగవాన్ గొడవర్తి, సెక్రటరీ జగన్మోహన్ విప్పర్తి పాల్గొన్నారు.

గ్రీన్ షెల్టర్లా... పార్కింగ్ స్థలాలా?

ప్రజాధనం.. కాంట్రాక్టర్ల పరం?

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవి నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికులు విశ్రాంతి పొందేందుకు జివిఎంసి ఏర్పాటుచేసిన గ్రీన్ షెల్టర్లు పార్కింగ్ స్థలాలుగా ఉపయోగ పడుతుండడం పలువురిని ఒకింత విస్మయానికి గురిచేస్తోంది. జివిఎంసి భీమిలి జోన్ పరిధి రెండో వార్డు సంగివలస అనిట్స్ కళాశాలకు దగ్గర్లో, మూడో వార్డు చిన బజారు, పెద్ద బజారు పాత బస్టాండ్ (స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం దగ్గర), నాలుగో వార్డు చేపలుప్పాడ జంక్షన్ వద్ద గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేశారు.

పెద్ద బజారు పాత బస్టాండ్‌వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ షెల్టర్ కాస్తా పార్కింగ్ స్థలంగా మారిందని చెప్పవచ్చు. ఇక్కడ ఏర్పాటుచేసిన గ్రీన్ షెల్టర్‌కు ఎదురుగా ఆర్‌టిసి బస్టాప్ (శాశ్వత షెల్టర్) ఉంది. ప్రయాణికులు, ప్రజలకు ఎండ నుంచి ఆర్‌టిసి బస్టాప్ వల్ల ఉపశమనం కలుగుతుంది. అంటే ఇక్కడ గ్రీన్ షెల్టర్ అవసరం అంతగా ఉండదు. అందుకేనేమో ఇక్కడున్న గ్రీన్ షెల్టర్‌లో కార్, మోటారు బైక్‌లు పార్కింగ్ చేయడం కనిపించింది.

సంబంధిత గ్రీన్‌షెల్టర్‌లో పక్కనే ఉన్న ఆపోలో ఫార్మసీ దుకాణంలో ఉన్న సిబ్బంది ఏకంగా ఔషధాలను, ఇతర వస్తువులను విక్రయించడం శనివారం స్థానిక జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము దృష్టికి వెళ్లింది. జోన్ పబ్లిక్ వర్క్స్ డిఇ సత్యనారాయణ, టిపిఒ రఘూన్సీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, సిబ్బందితో జోనల్ కమిషనర్ రాము గ్రీన్ షెల్టర్ వద్దకు చేరుకొని ఔషధ దుకాణ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం జేసిన విషయం విదితమే.



భీమిలి పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ షెల్టర్‌లో పార్కింగ్ చేసిన బైక్

గ్రీన్ షెల్టర్లు ఉద్దేశం నెరవేరడంలేదని చెప్పవచ్చు. ఎక్కడ అవసరమో అక్కడ గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేయలేదని ఇట్టే అర్థమవుతుంది. ఇలా ప్రజా ధనం కొద్ది మంది కాంట్రాక్టర్ల పరం అవుతుండడంపై స్థానికుల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి. చలివేంద్రాలు, గ్రీన్ షెల్టర్ల నిర్వహణను కాంట్రాక్టర్లకు జివిఎంసి అప్పగించిన విషయం విధితమే.

అనంతుని ఉత్సవాలకు చాగంటికి ఆహ్వానం

ప్రజాశక్తి-పద్మనాభం : శ్రీఅనంతపద్మనాభం స్వామి ఉత్సవాలకు రావాలని చాగంటి కోటేశ్వరరావును అనంత పద్మనాభస్వామి సేవా సంఘం అధ్యక్షులు దంతులూరి గోపిబాబు ఆహ్వానించారు. ఈ మేరకు కాకినాడలో ఉన్న చాగంటి నివాసానికి గోపిబాబు వెళ్లారు. చాగంటి స్పందిస్తూ 2024 సంవత్సరంలో జరిగే ఉత్సవాలకు హాజరవుతానని చెప్పారని గోపిబాబు తెలిపారు.

సీజ్ చేసిన మట్టి వేలానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-పద్మనాభం : అనంతవరం గ్రామానికి చెందిన పెద్ద చెరువు సమీపంలో అనధికారంగా నిల్వ ఉన్న 360 టన్ను మట్టిని స్థానిక తహశీల్దార్ తోట శ్రీవల్లి సీజు చేశారు. ఆ మట్టిని 22వ తేదీ సాయంత్రం వేలం వేయడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొని ధరావత్తు చెల్లించిన వారికి మట్టిని స్వాధీనం చేస్తామని పేర్కొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస జంక్షన్లో మూడు మండలాలకు సంబంధించి నూతన రూరల్ పార్టీ కార్యాలయాన్ని భీమిలి జనసేన ఇంచార్జ డాక్టర్ సందీప్ పంచకర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, రూరల్ మండలాలకు సంబంధించి మరింత చేరువుగా ఉండేందుకు ఈ కార్యాలయం ప్రారంభించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని పార్టీ కార్యాలయాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. వచ్చే నెల నుంచి గ్రామ, మండల స్థాయి కమిటీలు వేస్తామన్నారు. క్రియాశీలక సభ్యత్వాల్లో ఉత్తరాంధ్రలో భీమిలి మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు శివశంకర్, యశస్వి, నాయకులు కోన తాతారావు, సుందరపు విజయకుమార్ పాల్గొన్నారు.

ఆలయం కనిపించలేదని చెట్లు నరికివేత

స్థానికులు ఆగ్రహం



ఆలయం ముందు నరికివేసిన చెట్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించేందుకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి కృషి చేయాలని ప్రభుత్వాలు ప్రజలకు చెబుతుంటే.. మరోవైపు పచ్చగా ఉండే గ్రీన్ బెల్ట్‌లో చల్లని నిడనిచ్చే చెట్లును యథేచ్ఛగా నరికేస్తున్నారు. బిఆర్‌టిఎస్ రోడ్డు పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీ వద్ద గ్రీన్ బెల్టులో పదుల సంఖ్యలో చెట్లును నరికేసారు. బిఆర్‌టిఎస్ రోడ్డును ఆనుకొని సాయిబాబా ఆలయం ఉంది. ఆలయం ముందు గ్రీన్ బెల్టులో ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు ఉన్నాయి. ఆలయం సరిగా కనిపించలేదని నిర్వాహకులు పచ్చని చెట్లును నరికేసారు. సాధారణంగా ఆలయాల ముందు, చుట్టు పక్కల పచ్చదనం కోసం, భక్తులు సేదతీరేందుకు మొక్కలు పెంచుతారు. ఇక్కడ మాత్రం ఉన్న పచ్చదనాన్ని నాశనం చేయడం విడ్డూరంగా ఉంది. ఆలయం ఎదురుగా కారిడార్‌లో ఉన్న సుమారు 30 నుంచి 40 వరకు బాగా పెరిగిన మొక్కలను ఆలయ నిర్వాహకులు తొలగించారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సచివాలయ సిబ్బందికి స్థానికులు ఫిర్యాదు చేసినా చెట్లు నరకడం ఆపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చదనాన్ని నాశనం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు

అలరించిన చిన్నారులు

ప్రజాశక్తి- పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో శ్రీకాకుళం సోంపేట మండలానికి చెందిన శ్రీ నటరాజ నాట్యమండలిచే శాస్త్రీయ, జానపద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక స్తుతి, అన్నమయ్య కీర్తనలు, బ్రహ్మాంజలి, వేయి నామాలు వాడు, ఝుట నృత్యం, శివస్తుతి, కోయిలారే, ఘల్లు, ఘల్లు, వదినకు ఒకసారి, మూషిక వాహన తదితర అంశాలను ప్రదర్శించారు. వాసు దేవ్, స్వాతి, స్వప్న, జస్మిత, శ్రీలక్ష్మి, ఇక్షిత, ఆశ్రీత, సుదిక్ష, స్నేహ, హాసిని, ఇశ్రిత, అక్షయ, లోచని కళాకారులు నృత్యాలు ప్రదర్శించారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.



నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి


ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక సంగివలస 16వ నంబర్ జాతీయ రహదారి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. భీమిలి ఎస్ఐ హరీష్ కథనం ప్రకారం... రోడ్డు దాటుతున్న జివిఎంసి 2వ వార్డు వలందపేటకు చెందిన మొక్క శ్రీనివాసరావు (36)ను తగరపువలస నుంచి విశాఖ అతి వేగంగా వెళ్తున్న మోటారు బైక్ ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును అనిల్ నీరు కొండ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిన తర్వాత అదే రోజు రాత్రి 7.30 గంటలకు బంధువులు ఇంటికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మరలా అదే ఆసుపత్రికి అదే రోజు రాత్రి 8.30 గంటలకు తీసుకెళ్లగా, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన్న బజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ రోగులను పరీక్షించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు మెడల్స్

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు కొమ్మాది సమీపంలో ఉన్న కల్యాణ మండపం వద్ద పిఎన్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సీనియర్ కోచ్ సెవెంత్ డాన్ బ్లాక్ బెల్ట్ హోల్డర్ నర్సింగరావు, బ్లాక్ బెల్ట్ కోచ్ ప్రభాకర్ ఆధ్వర్యాన ఏడాది పాటు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్థానిక వైసిపి నాయకులు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులు బొట్ట అప్పలరాజు, కనకరాజు సియ్యాద్రి, గుంటబోయిన శ్రీనివాస్ యాదవ్, సంజీవ్‌యాదవ్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కనకరాజు సియ్యాద్రి మాట్లాడుతూ, విద్యార్థులందరూ చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు తగిన కృషిచేయాలని కోరారు. పిల్లలను ప్రోత్సహించి పంపిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

పాలిసెట్‌లో శశి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తగరపువలస : పాలిసెట్ -2023 ఫలితాల్లో స్థానిక సంగివలస శశి విద్యా సంస్థ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు సంస్థ ఫౌండేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.రక్షితసాయి రాష్ట్ర స్థాయి 37వ ర్యాంక్, డి.స్టీఫెన్ 51వ ర్యాంక్, పి.చరణ్ 63వ ర్యాంక్, డి.కృష్ణంనాయుడు 98వ ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.



సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు

శంకరరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి పురుషోత్తపురంలో ఉంటున్న బాయిపల్లి శంకరరావు సతీమణి సత్యవతి ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ టీవీ.కృష్ణంరాజు, మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర నాయకులు సిహెచ్.సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ, బాయిపల్లి శంకరరావు స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు ఉద్యమంలో పాల్గొన్నారని, ఆ సమయంలో అతని గొంతుకలో తూటా దిగిందని తెలిపారు. దీంతో అప్పటి నుంచి శంకరరావు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. భావితరాల కోసం నాటి ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు 829 రోజులుగా ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. సుమారు 32 మంది ప్రాణ త్యాగాలు చేసిన ప్లాంట్‌ను కాపాడుకునేందుకు రాష్ట్రంలోని ప్రజలందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అదాని, అంబానీలకు కట్టబెట్టడానికి బిజెపి చేస్తున్న కుట్రను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఏకం కావాలన్నారు. త్వరలోనే రాష్ట్రంలో ఉన్న ప్రజలందరితో సంతకాల సేకరణ చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న నల్లూరి సూర్యనారాయణ

మహానాడుకు తరలిరావాలి

ప్రజాశక్తి -గాజువాక : ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించే తెలుగుదేశం పార్టీ మహానాడుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని 86వ వార్డు పార్టీ అధ్యక్షులు నల్లూరు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం వార్డులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలు, అభిమానులు 27వ తేదీన బయలుదేరాలని కోరారు. ఎన్నికల ముందు జరగనున్న మహానాడుకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు రేగుంట శ్రీను, టి.రమణ, బొడ్డేపిల్ల అప్పారావు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సేనాపతి వసంతశంకరరావు

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డులోని సుజాతనగర్ పరిధి వేంకటాద్రినగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సామాజిక భవనం నిర్మాణానికి జివిఎంసి నుంచి రూ.18లక్షలు మంజూరురైనట్లు తెలిపారు. వార్డును అభివృద్ధి పథంలో నడిపించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. గతంలో కార్పొరేటర్‌గా చేసినప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విద్యాసాగర్, కార్యదర్శి రాజేశ్వరి, నాయకులు సూరిబాబు, కృష్ణవేణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు

రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు



రోడ్డుకు అడ్డంగా జెసిబితో పైపుల తరలింపు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి అనుమతితో హెచ్‌పిసిఎల్ పైప్‌లైన్ నిమిత్తం కణితి రోడ్డులో మూడు రోజులుగా తవ్వకాలు చేపట్టడంతో స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగ్గు సెంటర్ నుంచి కణితి రోడ్డు మార్కెట్ వరకు ఇష్టానుసారంగా జెసిబితో రోడ్లను తవ్వేశారు. మార్కెట్ రోడ్డు కావడంతో వాహనాలు రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ జామ్ అయి రోడ్డుపైనే గంటల పాటు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక పక్క ఎండ తీవ్రతతో గంటలుగంటలు వాహనాలతో నిలబడాల్సి రారవడంతో అవస్థలు పడుతున్నారు. తవ్విన గోతుల్లో పైప్ లైన్‌లో అమర్చే ప్రక్రియ రాత్రి సమయాల్లో పోలీసులు సహాయంతో చేస్తారు. కాని గాజువాకలో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంలో పగటి సమయంలోనే చేస్తున్నారు. దీంతో వ్యాపారాలు చేసుకున్న వారికి, కొనుగోలుకు వచ్చిన వారికీ ఇబ్బందులు తప్పడంలేదు. ఈ విషయం తెలిసినా జివిఎంసి అధికారులు స్పందించడం లేదు. భారీ పైపులను క్రేను సహాయంతో తీసుకెళ్లి గోతుల్లో అమర్చేటప్పుడు పొరపాటున ఎవరి మీద పడినా ప్రమాదం జరిగే అవకాశమున్నా పనులు పగలే చేస్తున్నారు. స్థానికులు ప్రాణ భయంతో బిక్కుబిక్కు మంటూ ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను రాత్రి సమయాల్లో చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



పైపులైను కోసం రోడ్డుపై సాగిన తవ్వకాలు

ట్రాఫిక్ సమస్య

జగ్గు సెంటర్ నుంచి కణితి రోడ్డు వరకు పైపులైను కోసం గోతులు తవ్వే పనులు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. ఈ పనులు రాత్రి సమయంలో చేస్తే బాగుంటుంది.



విష్ణు, మెకానిక్
జగ్గు సెంటర్

బాగున్న రోడ్లు తవ్వుతున్నారు

బాగున్న రోడ్లను తవ్వి వదిలేస్తున్నారు. ఆరు నెల క్రితం కణితి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఇప్పుడు మళ్లీ పైప్ లైన్ కోసం తవ్వేస్తున్నారు.



గంగాధర్,
కణితి రోడ్డు

ఇబ్బంది లేకుండా చూడాలి

పైపులైన్లు వేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అసలే ఇరుకైన రోడ్డు.. ఆపై గోతులు తీస్తుండటంతో పది రోజులుగా ప్రజలు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బంది పడుతున్నారు.



ఎం.రాంబాబు,
సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి

'గంగవరం' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అభివాదం చేస్తున్న అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు

ప్రజాశక్తి-గాజువాక : గంగవరం అదాని పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్‌చేశారు. పోర్టు కార్మికులతో శనివారం సాయంత్రం దిబ్బపాలెంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, 14 సంవత్సరాల నుంచి పోర్టు కార్మికులు చాలీచాలని జీతాలతో జీవనాన్ని నెట్టుకొస్తున్నారన్నారు. కార్మికులకు వేతనాలు పెంచకుండా పోర్టు యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని, కనీస వేతనాల చట్టం అమలు చేయడం లేదని తెలిపారు. పక్కనే ఉన్న వైజాగ్ పోర్టులో మాదిరిగా కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, పోర్టు యాజమాన్యం తొలగించిన కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కార్మికుల వేతనాలు పెంచలేని సమక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని పోర్టు యాజమాన్యాన్ని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, గంగవరం పోర్టు లాభాల బాటలో ఉన్నా కార్మికుల వేతనాలు పెంచడం లేదన్నారు. కార్మికులందరూ ఐక్యంగా హక్కులు సాధించేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ - చలానాలు రద్దుచేయాలని నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేస్తున్న పోలీస్ ఈ చలానాలు రద్దుచేయాలని కోరుతూ ఆదివారం సత్యం జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు నిరసన ధర్నా చేపట్టారు. ఈ ధర్నా నుద్దేశించి ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లపై ఉన్న పాత పోలీస్ ఈ చలానాలను రద్దుచేసి డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు. పెరిగిన డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఆటో డ్రైవర్లపై ప్రభుత్వం కన్ను ఎర్ర చేయడం తగదన్నారు. వాహన మిత్ర పేరుతో రూ.10 వేలు ఇచ్చి పోలీస్ ఈ చలానాలు, రవాణా శాఖ అధికారులు అక్రమ కేసులు పెట్టి సంవత్సరానికి ఒక్కో ఆటో డ్రైవర్ నుంచి రూ.50వేలు గుంజుతున్నారని మండిపడ్డారు. డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేస్తూ విడుదల చేసిన జీవో 21ని, లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లపై 25 నుంచి 30 శాతం పన్నులు పెంచుతూ విడుదల చేసిన జీవో 31ని రద్దు చేయాలని, భారీగా పెంచిన టోల్ ప్లాజా ఫీజులను, డీజిల్, పెట్రోలు వంట గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో రావికృష్ణ స్టాండ్ అధ్యక్షులు సిహెచ్ రామకృష్ణరాజు, దుర్గాప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లల కోసం ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార స్వాతి ప్రమోటర్స్ సంస్థ ఎమ్‌డి రమేష్ రెడ్డి పిల్లలు లక్ష్మీస్వాతి, లక్ష్మీ క్షీరజ తయారుచేసిన పెయింటింగ్స్, క్యాండిల్స్, కీ చైన్స్, జ్యూయలరీ తదితరాలను ఆర్‌కె.బీచ్ రోడ్డులో ప్రదర్శనకు ఉంచారు. ఈ వస్తువులను తాము సొంతంగా తయారుచేసి ప్రదర్శించినట్లు లక్ష్మీస్వాతి తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన నగదును పేద పిల్లల కోసం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సద్విక, హేమ, విద్యార్థులు పాల్గొన్నారు.



పలు ఉత్పత్తులను ప్రదర్శనకు పెట్టిన 'స్వాతి' ఎమ్‌డి పిల్లలు

'ఉపాధి' పరిరక్షణకు ఐక్య ఉద్యమం



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత నాయినిబాబు

ప్రజాశక్తి- కె.కోటపాడు : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కుదించడం ద్వారా నిర్వీర్యం చేసేందుక కుట్ర పన్నుతోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు విమర్శించారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకునేందుకు మళ్లీ ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఆదివారం. మండలంలోని చౌడవాడ గ్రామంలో రాఘవ రాజు చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పనిప్రదేశంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నాయినిబాబు మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు జాబ్‌కార్డున్న . ప్రతి కుటుంబానికి ఏడాదిలో 200 పనిదినాలు కల్పించాలని, రోజుకు ఒక్కో కూలీకి సగటున రూ.600 వేతనం వచ్చేలా చర్యలు చేపట్టంతోపాటు వేసవి అలవెన్స్‌గా రోజుకు రూ.60 చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనిముట్లకు ప్రభుత్వం డబ్బులు చెల్లించాలని కోరారు. ఉపాధి నిధులు పక్కదారిని పట్టకుండా ఉపాధి కూలీలకే ఖర్చు చేయాలన్నారు. అంగన్వాడీ సెంటర్లు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలు, ఇతర నిర్మాణాలకు ఉపాధి నిధులను వినియోగించరాదని, వీటిని కేవలం కూలీలకు చెల్లింపులకే వినియోగించాలని కోరారు. బడ్జెట్‌లో నిధుల కోత, సంస్కరణలు,నిబంధనల పేరుతో ఉపాధి కూలీ గిట్టుబాటు కాకుండాచేయడం, చట్టంలోని నిబంధలన్నీ ఏవీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగాఉపాధి హామీ పథకం పరిరక్షణకు కూలీలంతా సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, ఉపాధి మేట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, తదితరులు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎయిడ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. హేమంత్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి ఆవరణలో 40వ అంతర్జాతీయ ఎయిడ్స్ రోగుల దివ్యస్మృత్యంజలి దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి ఎయిడ్స్‌తో చనిపోయిన వారి పట్ల సంఘీభావం చూపుతామని, మహమ్మారితో బాధపడుతున్న వారి పట్ల వివక్ష, కళంకిత భావన లేకుండా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరూ ఎయిడ్స్ బాధితుల పట్ల సానుకూలం ధృక్పథంతో వ్యవహరించి, వారికి బాసటగా నిలిచేందుకు ముందుకు రావాలని డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ హేమంత్ పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్ కుమార్, డిఎల్ఎటిఒ డాక్టర్ కిషోర్ కుమార్, ఎఆర్‌టి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియదర్శిని, టిబి ఆసుపత్రి సూపర్‌వైజర్లు, ఐసిటిసి సూపర్‌వైజర్లు, ఆశాకార్యకర్తలు, ఎఆర్‌టి సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో సాయి సురేంద్రకుమార్ ప్రతిభ



సురేంద్రకుమార్‌ను అభినందిస్తున్న ఎంపీ, కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం గ్రామానికి చెందిన కర్రి సాయి సురేంద్రకుమార్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి ద్వితీయస్థానంలో నిలిచాడు. కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన సురేంద్రకుమార్‌కు రజత పతకంతోపాటు ప్రశంసాపత్రాన్ని జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పట్టన్ శెట్టి, అనకాపల్లి ఎంపి డాక్టర్ బివి.సత్యవతి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అందజేశారు. ఈ సందర్భంగా సాయి సురేంద్రకుమార్‌ను సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట భూ అక్రమాల నిరూపణకు సిద్ధం

మంత్రి అమర్‌నాథ్, వైసిపి నేతలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సవాల్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

ప్రజాశక్తి - కశింకోట : విస్సన్నపేట భూకుంభకోణం జరిగిందని నిరూపించడానికి తగిన ఆధారాలతో తాను సిద్ధమని, అనకాపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పునరుద్ఘాటించారు. ఆదివారం మండలంలోని తాళ్ళపాలెం టిడిపి కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ, మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబేనని, టిడిపి లేకపోతే అమర్నాథ్ జీవితం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. అనకాపల్లి సభకు వచ్చిన జనాలను చూసి అమర్నాథ్, ఇతర వైసిపి నేతలకు మతిభ్రమించిందన్నారు. విస్సన్నపేటలో భూఅక్రమాలు జరగలేదని మాటల్లో చెప్పడం కాదని, తాను ఆధారాలతో భూకుంభకోణం నిరూపించడానికి సిద్ధంగా ఉన్నందున, దమ్ముంటే సవాల్ స్వీకరించాలన్నారు.. మంత్రి గుడివాడ అమర్నాథ్ అవినీతే వల్లే రాష్ట్రానికి, మరీ ముఖ్యంగా ఈ ప్రాంతానికి పరిశ్రమలు రావడం లేదన్నారు. రోజా టీవీలో కనిపించే అమర్ చేష్టలు కామెడీని తలపిస్తున్నాయని, స్థాయిని మరిచి మాట్లాడుతూ పదేపదే అభాసుపాలౌతున్నా సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. మంత్రి అమర్‌కు బినామీయే బొడ్డేడ ప్రసాద్ అని, ఇవిగో ఆధారాలంటూ కొన్ని డాక్యుమెంట్లు చూపించారు.కార్యక్రమంలో కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు కాయల మురళి, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి ఉగ్గిన రమణ మూర్తి, జిల్లా కార్యదర్శి సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, కలగా సోమేశ్వరరావు, ద్వారపురెడ్డి సత్తిబాబు, ఆంధ్ర ప్రసాద్, ఉలింగాల రమేష్, నూకినాయుడు, సారిపల్లి నానిబాబు, సంతోష్ ఇతర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం ఎపిఇపిడిసిఎల్ సెక్షన్ పరిధిలో సోమవారం ఉదయం 7.30గంటలు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టనున్నందున. గృహాలతోపాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. తాళ్ళపాలెం సెక్షన్ పరిధిలోని తాళ్ళపాలెం, ఉగ్గినపాలెం, పరవాడ పాలెం, జమాదులపాలెం గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

27, 28 తేదీల్లో యోగా కేంద్రం వార్షికోత్సవం



మాట్లాడుతున్న దొరమ్మ నాయుడు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 27,28 తేదీల్లో స్థానిక జార్జిక్లబ్ యోగాసెంటర్ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు యోగా గురువు, కేంద్రం గౌరవాధ్యక్షులు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. ఆదివారం జార్జిక్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, వార్షికోత్సవం సందర్భంగా అందరికీ ఆరోగ్యం పెంపొందించేందుకు ఈనెల 27న యోగాపై పట్టణ పురవీధుల గుండా చైతన్య ర్యాలీ నిర్వహిస్తామని, 28న ఉదయం యోగాసనాల పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి సాయంత్రం బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో యోగా గురువు ఎం.జనార్దన్ (జగన్) , పెంటకోట సుబ్రహ్మణ్యం, కొలపర్తి కన్నబాబు, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఆడారి చిన్న వీరు నాయుడు, కాంగ్రెసుల మురళి, కొణతాల శివాజీ, ఎ.రామకృష్ణ, మాదేటి సత్యనారాయణ, కెవి సత్యనారాయణ, కొణతాల పెద్ద, కాండ్రేగుల చిన్న, ఆడారి ప్రేమ్‌కుమార్, డి శ్రీనివాసరావు, పందూరి సత్యనారాయణ, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



నేత్ర పరీక్షల అనంతరం కళ్లద్దాలను అందజేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని మూలపేట గ్రామంలో ఆదివారం సోడదాసి శ్రీనివాస్ శామ్యూల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి నేత్ర పరీక్షలు నిర్వహించగా, 16 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి, ట్రస్ట్ ఛైర్మన్ ఎస్ శాంతి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు.ఈ సందర్భంగా కంటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు, వార్డు సభ్యులు ఎల్లపు హైమావతి, ఆడారి సత్యనారాయణ, కాండ్రేగుల వరలక్ష్మి, శ్రీనివాసరావు, రైతు సంఘం మాజీ అధ్యక్షులు ఎల్లపు నాయుడు, లక్ష్మీబాయి కుమార్, ఆదిరాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో ఆదివారం విశాఖపట్నం ఒమ్ని ఆర్కే ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరాన్ని సర్పంచ్ భీమిశెట్టి మంగ లక్ష్మి, ఎంపిటిసి శరగడం అప్పల నరసమ్మ ప్రారంభించారు. ఓమ్ని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వంశీ, డాక్టర్ సాయి ప్రదీప్ రోగులను పరీక్షించి, వైద్యసేవలందించారు. ఇసిజి, సుగర్, బిపి, ఇతర రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, గ్రామ పెద్దలు భీమిశెట్టి కృష్ణారావు, గౌరీ అంతర్జాతీయ ఐక్య సేన అధ్యక్షులు ఉమా శంకర్, విశాఖపట్నం పాలిటెక్నికల్ కాలేజ్ ప్రిన్సిపల్ భీమిశెట్టి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము, గ్రామ విధేయ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు శరగడం సూరిబాబు, మళ్ల స్వామి చంద్రనాయుడు, క్యాంపు నిర్వాహకులు ఆడారి పాపారావు, మళ్ల అప్పలనాయుడు, వెంకయ్య నాయుడు, రామ అప్పారావు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వాలంటీర్లు!

గడపగడపకూ మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి- చోడవరం : ప్రభుత్వం, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులు వాలంటీర్లని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం తన పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన, సేవా అవార్డులను పొందిన సచివాలయ వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా, లబ్ధిదారుని వద్దకే సంక్షేమ పథకాలను చేరవేయడంలో వాలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయంటే అందులో వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని, తక్కువ గౌరవ వేతనంలో ఎక్కువ అంకితభావంతో పనిచేస్తున్న వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారికి మూడు రకాల సేవా అవార్డులను అందించడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతలను అభినందించారు.



బెన్నవోలు గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

బెన్నవోలులో గడపగడపకూ..

అంతకుముందు మండలంలోని బెన్నవోలు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే సచివాలయంలో వాలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిపి గాడి కాసు, వైస్ ఎంపిపి బుద్ధ గంగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైసిపి నాయకులు మూడేళ్ల శంకర్రావు, పతివాడ అప్పారావు, శ్రీనివాసరాజు, సేనాపతి శ్రీను, బాబురావు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-సీతమ్మధార: ప్రతిభ క్రీడా, సాంస్కృతిక సంస్థ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలలో ప్రతిభ చూపిన 27 మందిని ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. కెఎల్.కామేశ్వరరావు, జయంతి లక్ష్మీనరసింహ, ఎస్.మురళి, ఎంవి.సుబ్రహ్మణ్యం, పి.నాగరాజు, ఎ.సునీతకిరణ్, అర్జునుడు, వెలగాడ సంగీత, వెలగాడ కృష్ణప్రియ, వెలగాడ జ్యోతి, తాటిపూడి రత్నం, విజయ రమణితో పాటు పలువురిని సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథి, విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, వివిధ రంగాలలో విశేష సేవలందించిన పలువురిని గుర్తించి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. విజెఎఫ్ ఉపాధ్యక్షులు నాగరాజ్ పట్నాయక్ మాట్లాడుతూ, ప్రతిభ సంస్థ నిర్విరామంగా చేస్తున్న కార్యక్రమాల ద్వారా ఎంతోమంది వెలుగులోకి వస్తున్నారని చెప్పారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతిభ గల వారిని గుర్తించి అవార్డులు ఇస్తున్న నిర్వాహకులకు అభినందించారు. వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల శివగణేష్ మాట్లాడుతూ, ఏటా క్రమం తప్పకుండా ఎంతోమంది ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. ప్రతిభ సంస్థ అధ్యక్షులు అడవి రాజు మాట్లాడుతూ, కళామిత్ర ఎవి జగన్నాథరావు పట్నాయక్ ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు మేడ మస్తాన్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది ఎస్ఎస్ఎస్.రాజు, జనసేన నాయకులు తెలుగు అర్జున్, విశాఖ రత్న కళా పరిషత్ అధ్యక్షులు పి.ఎ.భాస్కరరావు, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి, ప్రముఖ వ్యాఖ్యాత బిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమాంబ ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీ కనకమాంబ ఆలయ అభివృద్ధికి శ్రీ కృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యాన 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సారిపిల్లి గోవింద మాట్లాడుతూ, ఉత్సవ కమిటీ సభ్యుల సూచనల మేరకు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు నేమ్మలూరి శివగణేష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు నితిష్ జైన్, వినీత్‌జైన్, సారిపిల్లి పోతురాజు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్, పాలకవర్గ సభ్యులు సారిపిల్లి గంగరాజు, బూర వెంకటరమణ, సానబోయిన సురేష్, ఇసరపు అప్పారావు, నమ్మి వెంకట్, గొంపా అప్పారావు, వారది శ్రీను, వియ్యపు సంతోష్, ఆవాల బుజ్జి, ఒమ్మి ఆనంద్, ముద్దాడ గోవింద్, వై.వెంకటరమణ, ఆవాల వెంకట్, సారిపిల్లి వెంకటరమణ, అల్లు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- చోడవరం : బ్రాహ్మణుల ఐక్యత, సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం చోడవరంలోని బ్రాహ్మణ భవనంలో సంఘం గౌరవాధ్యక్షులు మంథా గౌరీ శంకర్ అధ్యక్షతన అధ్యక్షులు కందర్ప వెంకట రామేశం (రమేష్), గుంటూరు సత్యనారాయణ, కందర్ప కృష్ణమూర్తి, ఇతర సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో సంఘం సంక్షేమానికి, భవనం నిర్మాణానికి విశేష కృషిచేసి, అమరులైన ఈమని నరసింహమూర్తి, ఇచ్ఛాపురపు లక్ష్మి నరసింహం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 50వ వివాహ వార్షికోత్సవం జరుపు కుంటున్న విశ్రాంత ఉపాధ్యాయులు గొటేటి సీతారామయ్యను ఘనంగా సన్మానించారు. గాయత్రి సేవా ట్రస్ట్, గణేష్ బ్రాహ్మణ సంఘం రెండింటిని విలీనంచేసి, శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఏర్పాటు చేసి, సభ్యులందరి ఏకాభిప్రాయంతో బ్రాహ్మణ పెద్దలు తొమ్మిది మందితో సలహా మండలి బోర్డు, ముగ్గురు గౌరవాధ్యక్షులు, 13 మంది కార్యవర్గసభ్యులు, తొమ్మిది మంది పురుషులు, ముగ్గురు మహిళలు అసోసియేట్ సభ్యులు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. నాలుగు కమిటీలకు కందర్ప కృష్ణమూర్తి అధ్యక్ష కార్యదర్శ బాధ్యతలు నిర్వహించగా, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షులుగా పుల్లేపు శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొమ్మనమంచి నరసింహ మూర్తి వ్యవహరిస్తారు. పట్టణ పురోహితులైన ధవళ శ్రీను, ఎపి బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ వడ్డాది నరసింహమూర్తిలకు అడ్వైజరీ కమిటీలో స్థానం కల్పించారు. కార్యక్రమంలో విజ్జమూరి శంకర్, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, ఎవి.జగన్నాథరావు, మండా శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పలు పోటీలు



చోడవరంలో ఆటలు ఆడుతున్న బాలికలు

ప్రజాశక్తి -చోడవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. కథల పఠనంపై అవగాహన కలిగించారు. లైబ్రేరియన్ తిరుమలకుమారి ఆధ్వర్యంలో గ్రంథాలయం పక్కనే ఉన్న స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో పోటీలు నిర్వహించారు.



తాళ్లపాలెంలో క్రాఫ్ట్ వేస్తున్న విద్యార్థులు

మునగపాక రూరల్: వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం భారతదేశ అభివృద్ధిని నిరోధించే అంశాలు, తీసుకోవలసిన చర్యలు అనే అంశంపై ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచనలో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎల్‌వి. రమణ, గణేష్ పాల్గొన్నారు.

కశింకోట : తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కలర్ పేపర్‌పై క్రాఫ్ట్ వర్క్ వేయడంపై అవగాహన కల్పించారు. రాధాకృష్ణల కోలాటం, పిల్లలతో వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సురేష్‌కుమార్, అచ్చర్ల సచివాలయం సెక్రటరీ ఎం. మహేష్, గ్రంథాలయాధికారి కె.జగన్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా యోగా, వ్యాయామంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ పి.ప్రభాకర్ కథలు, పాటలు నేర్పించారు. రాజ్యలక్ష్మి టీచర్ పిల్లలకు యోగా ప్రాముఖ్యత వివరించారు. రిక్రియేషన్ గేమ్ ఆడించారు. పిల్లలకు ఓఆర్ ఎస్ ద్రావణం, బిస్కట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని పి.దమయంతి పాల్గొన్నారు.

గొలుగొండ: శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా గ్రంథాలయ అధికారి రాజబాబు ఆధ్వర్యంలో ఆదివారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, జనరల్ నాలెడ్జ్ ప్రశ్నల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 18 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మునగపాకలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



నర్సీపట్నంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నేడు ల్యాండ్ పూలింగ్ రైతుల సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక బెల్లం మార్కెట్‌ను ఆనుకొని వున్న వ్యవసాయ భూములను 2007లో ల్యాండ్‌పూలింగ్ ద్వారా సేకరించిన వుడా, నేటికీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతోందనిఅనకాపల్లి రైతు సంఘం నాయకులు బీశెట్టి కృష్ణ అప్పారావు ఆరోపించారు. ల్యాండ్ పూలింగ్ నిర్వాసిత రైతుల సమస్యలపై ఈనెల 22న సోమవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అధ్యక్షతన స్థానిక వివి రమణ రైతు భారతిలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాధిత రైతులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి- మునగపాక రూరల్: స్థానిక తంపరమూల ప్రాంతంలో సత్తెమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపిపి మళ్ల జయలక్ష్మితోపాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంపరమూల రైతు సంఘం అధ్యక్షులు కాంగ్రెగుల మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో ఎంపిటిసి సూరిశెట్టి రాము, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహనరావు, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చంనాయుడు, ఆడారి కాశిబాబు, దాడి భీమ నాయుడు పాల్గొన్నారు.

'బిఎన్ఆర్'లో సాంస్కృతిక ప్రదర్శనలు



వివిధ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి -కంచరపాలెం : బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన బిఎన్ఆర్ భవనంలో ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో దేశభక్తి పాటలు, కళా ప్రదర్శనలు, సామాజిక అంశాలపై పాటలు, ప్రదర్శనలు, కూచిపూడి, కరాటే, మిమిక్రీ, డబుల్ హెడ్ డాన్స్ వంటి అనేక ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో 50 మంది కళాకారులు నాలుగు గంటలపాటు కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లలలో ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని, నిర్వహించిన బిఎన్ఆర్ ఫౌండేషన్‌ను సభికులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

అల్లం అప్పారావు మృతికి సంతాపం

ప్రజాశక్తి -గాజువాక : జెఎన్‌టియు యూనివర్సిటీ ప్రథమ వీసీ ప్రొఫెసర్ అల్లం అప్పారావు మృతి పట్ల గాజువాక ఎంవిఆర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. యుఎస్ఎలో మార్నింగ్ వాక్ చేసి విశ్రాంతి తీసుకున్న తర్వాత కొద్దిసేపటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు.

108లో ప్రసవం

ప్రజాశక్తి -అడ్డతీగల : వై.రామవరం మండలంలోని మారుమూల గండిపాలెం గ్రామానికి చెందిన బలిజ ఆదిలక్ష్మి ఆదివారం 108 వాహనంలో ప్రసవించి, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 వాహనంలో అయినప్పటికీ, సుఖప్రసవం కావడం, తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండడంతో కుటుంబసభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. గండిపాలెనికి చెందిన ఆదిలక్ష్మికి ఆదివారం పురిటి నొప్పులు రావడంలో స్థానికంగా ఉన్న ఆశాకార్యకర్త అక్కడికి చేరుకుని, పరిస్థితిని పరిశీలించింది. ఇంటివ ద్ద కంటే ఆసుపత్రిలో డెలివరీ మంచిదని కుటుంబసభ్యులకు వివరించి, వారి ద్వారా 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు అధికమవ్వడంతో ఆశాకార్యకర్తతోపాటు 108 వాహన ఇఎంటి రామకృష్ణ, పైలెట్ నవాజ్ వాహనాన్ని ఆపి, గర్భిణి ఆదిలక్ష్మి డెలివరీకి సహకరించారు. దీంతో సుఖప్రసవమై, మగబిడ్డకు జన్మనివ్వడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నప్పటికీ, తదుపరి పరీక్షలు, మెరుగైన వైద్యం కోసం చెవిటిదిబ్బలు పిహెచ్‌సికి తరలించారు. ఆదిలక్ష్మి డెలివరీకి సకాలంలో వాహనాన్ని తెచ్చి సహకరించిన 108 సిబ్బంది ఇఎంటి రామకృష్ణ, పైలెట్ నవాజ్‌తోపాటు ఆశా కార్యకర్తలకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లర్ల దశలో నిలిచిన..

ఆర్‌బికె నిర్మాణ పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని లింగంపేట పంచాయతీలో రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె) నిర్మాణ పనులు నిలిచి ఏడాది అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. రూ.21.8 లక్షల అంచనా వ్యయంతో 2020లో నిర్మాణ పనులకు వైసిపికి చెందిన నాయకుడు ఒకరు ముందుకొచ్చారు.. ఆయన పిల్లర్ల స్థాయి వరకు నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే వద్ద పలుకబడి ఉన్న మండలానికి చెందిన ఓ నాయకుడి సిఫార్సుతో అదే పార్టీకి చెందిన మరో వ్యక్తి రంగప్రవేశం చేశాడు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఈ నిర్మాణ పనులు పిల్లర్ల స్థాయి దాటలేదు. మండల కేంద్రంలో వారానికి ఒక మారు నిర్మాణాలపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సమీక్షలు చేస్తున్న అధికారులు లింగంపేట ఆర్బీకే కేంద్రంపై ఏ మాత్రం మాట్లాడ లేదు. ఆర్బీకే కేంద్రం లేకపోవడంతో ఎరువులు, విత్తనాలకు సచివాలయమే నిల్వ కేంద్రంగా మారింది. ఎమ్మెల్యే స్పందించి ఇంజనీరింగ్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చి ఆర్బీకే భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పిల్లర్ దశలో నిలిచిన ఆర్‌బికె

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో మరుపాక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె సత్య సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 25 నుండి జూన్ 7 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, సీఈసీ, గ్రూపులలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబాధన జరుగుతుందన్నారు. ఓసి, బిసి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఆన్లైన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదిపతిన సీట్లు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యా బోధనను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక బ్యాంక్ కాలనీ అపార్ట్మెంట్ వద్ద సిపిఐ, రైతు సంఘం ఉద్యమ నేత, రాష్ట్ర నాయకులు కొల్లి నాగేశ్వరరావు 3వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేశారని కొనియాడారు. నాగేశ్వరరావు ఆశయాలతో పంటలకు గిట్టుబాటు ధర, కౌలు రైతుల రుణాలు, భూములకు సాగు హక్కు కల్పన తదితర సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, డిసిహెచ్ క్రాంతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శివ లంక కొండలరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లి కొండబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జీ.పణంద్ర, నర్సీపట్నం రూరల్ కార్యదర్శి నల్లబెల్లి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



నక్కపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

మాజీ ప్రధానమంత్రి, కీర్తిశేషులు రాజీవ్‌గాంధీ వర్ధంతిని విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

భీమునిపట్నం : స్థానిక చిన్న బజారు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పిసిసి సభ్యులు తెడ్డు రామదాసు ఆధ్వర్యాన పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మకాయల పైడిరాజు, సిహెచ్.నరసింహారావు, పాసి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాజువాక : పాతగాజువాక రాజీవ్ కూడలి వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయ కర్త జెర్రిపోతుల ముత్యాలు ఆధ్వర్యాన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడివాడ శ్రీను, యరభాల భూలోక, ఆనంద్‌బాబు, శనివాడ హరిబాబు, సియ్యాద్రి అప్పారావు, కొత్తపల్లి పెంటయ్య, ఉరుకూటి కుమార్, బైరాగి, షరీఫ్, ఆనంద్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట వాసుదేవరావు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ఆర్.గురునాథరావు, వాసుపల్లి సత్తిబాబు, ఎస్‌రవి, బి.రాజు, ఎల్.కనకరాజు, ఎస్.బాబ్జీ పాల్గొన్నారు.

అనకాపల్లి : భారత్‌లో శాస్త్ర,సాంకేతిక రంగాలను ప్రవేశపెట్టి, విస్తరింపజేసిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఐఆర్.గంగాధర్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఫ్లులమాలలు వేసి నివాళులు అర్పించారు. అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్ కుమార్, తేబూడి సంతోష్, మళ్ల శివకుమార్, పిల్లి త్రినాథ్ గౌడ్ పాల్గొన్నారు.

కశింకోట : రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కశింకోట మెయిన్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. చిరుప్రాయంలోనే దేశ ఆరవ ప్రధానిగా ఎన్నో పథకాలు, సంస్కరణలతో అభివృద్ధి పథాన నిలిపారన్నారు. భారత దేశాన్ని సాంకేతిక, ఆర్థిక రంగాలలో అగ్రస్థానంలో నిలపడంతోపాటు 18ఏళ్లకే ఓటుహక్కు జవహర్ నవోదయ విద్యాలయాల స్థాపన, రాజ్యాంగంలోని 73,74 అధికరణం ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను స్థాపించి గ్రామీణ, పట్టణ సంస్థలకు నిధులు సమకూచి, స్థానిక సంస్థలు బలోపేతం చేయడం వంటి ఎన్నో చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, న్యాయ విభాగం జిల్లా అధ్యక్షులు సూరా శ్రీనివాస్, అనకాపల్లి అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యులు కాళ్ళ సత్యనారాయణ, న్యాయవాది ఐఆర్ గంగాధర్, దాసరి సంతోష్, సూరిశెట్టి ఆదిబాబు, మాడెపు నాయుడు, వాయిబోయిన రాజు, జగ్గ అప్పారావు, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బి. బాల మురళీ పాల్గొన్నారు.

పరవాడ: మాజి ప్రధాని రాజీవగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పరవాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కెవి రామయ్య నాయుడు, రాష్ట్ర ఒబిసి సెల్ కోఆర్డినేటర్ ఆర్‌ఆర్ నాయుడు రాజీగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, కార్యక్రమంలో మాధవి, రాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నంగిన రమణ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పీసీసీ సభ్యులు మీసాల సుబ్బన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ అధ్యక్షులు రాజన్నరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడేటి శంకర్ రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తుల రఘు, నీలి అశోక్, గంగిశెట్టి గణేష్, ముద్దా నాగేశ్వరరావు, దేశెట్టి నాగేశ్వరరావు, దేశెట్టి పాము, బర్రెలంకి సత్తిబాబు, చిన్న, దూది నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అల్లిపురంలో...

23న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 23న మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఈపీడీసీఎల్ ఆపరేషన్ నర్సీపట్నం ఈఈ సురేష్ బాబు, మండల శాఖ ఏఈ నందన్ ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తకోట సబ్ స్టేషన్ పరిధి జే నాయుడుపాలెం ఫీడర్‌కు సంబంధించిన మరమ్మతులు నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని వారు చెప్పారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని సిహెచ్‌బి అగ్రహారంలో ఆదివారం ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, నాయకులు శీరం నరసింహమూర్తి, వెదుళ్ళ రమణ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



దారి లేని రైతు భరోసా కేంద్రం ఇదే..

రైతు భరోసా కేంద్రానికి దారేదీ?

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో పందూరు గ్రామానికి సంబంధించి రైతు భరోసా కేంద్రం రెండు సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టినా నేటికీ కేంద్రానికి వెళ్లే దారి సక్రమంగా లేక పోవడంతో ఇటు రైతులు, అటు సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైతు భరోసా కేంద్రానికి ముందు భాగంలో కొండవాలు గెడ్డను దాటుకుని కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. కొండవాలు గెడ్డకు కల్వర్టు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రెండు సంవత్సరాలుగా నిర్మాణం చేపట్టక పోవడంతో ఏ క్షణాన ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇతప్పటికైనా స్పందించి రైతు భరోసా కేంద్రానికి వెళ్లేందుకు కల్వర్టు నిర్మాణం చేపట్టాలని పలువురు గ్రామస్తులు కోరుకుంటున్నారు.



నిందితులతో పోలీసులు

50 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-నక్కపల్లి :50 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. వేంపాడు టోల్గేట్ వద్ద కారును తనిఖీ చేయగా 50 కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. 50 కేజీల గంజాయి, కారును స్వాధీన పరుచుకుని మధ్యప్రదేశ్ చెందిన ఇద్దరు వ్యక్తులు షారుక్ ఖాన్, జబీర్ ఖాన్ లను అరెస్టు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఎయిడ్స్ నియంత్రణపై ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఎయిడ్స్ నియంత్రణపై ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో చైతన్య ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సలీం భాష, ఎయిడ్స్ నివారణ విభాగం అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ నాయుడు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- కలెక్టరేట్:పాత నగరంలోని కోటవీధి ఉర్దూ పాఠశాలలో ఆదివారం ఆవాజ్, ఆస్క్ పౌండేషన్ జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య పరీక్షలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎండి అజార్ రెహమాన్, షాదఫ్ ఖానమ్, బిలాల్ రెహమాన్ ఖాన్, మొహిద్దిన్ అహ్మద్ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్, ఆస్క్ పౌండేషన్ జిల్లా కమిటీ ప్రతినిధులు అబ్దుల్ అహ్మద్ షరీఫ్, ఎండి ఆయూబ్, కె.యు ఖాన్, ఎండి ఆసిక్, ఎండి రియాజ్, అబ్దుల్ మునార్, ఎండి రెహమాన్, ఎండి షఫీ, ఎండి రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ అల్లం అప్పారావు మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్:బిగ్ డేటా విశ్లేషకులు, కాకినాడ జెఎన్‌టియు కంప్యూటర్ నిపుణులు, ఆంధ్ర యూనివర్సిటీ పూర్వపు ప్రొఫెసర్ అల్లం అప్పారావు మరణించారు. అమెరికాలోని డల్లాస్‌లో గల తన కుమార్తె ఇంటిలో శనివారం నిద్రలో ఉండగానే ఆయన కన్నుమూశారని ఆయన కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. మార్నింగ్ వాక్ కు వెళ్లిన ఆయన తిరిగి వచ్చి మళ్లీ నిద్రపోతూనే కన్నుమూశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండికి చెందిన గురుమూర్తి, లక్ష్మీబాయి దంపతుల కుమారుడైన అప్పారావు చిన్నతనం నుంచి చదువులో ఎంతో నిష్ణాతులు. ఆంధ్రా యూనివర్సిటీలో అధ్యాపకునిగా, రీడర్ గా పని చేయకుండానే నేరుగా ప్రొఫెసర్‌గా నియమితులైన తొలి వ్యక్తి ఆయన. కంప్యూటర్ విభాగం అధిపతిగా, చీఫ్ వార్డెన్ గా,బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. 2018 నవంబర్‌లో ఆదికవి అన్నమయ్య యూనివర్సిటీ ఆయనను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. అప్పారావు మరణ వార్త తెలియడంతో,ఎయులో అతని సహచరులు, అతని వద్ద చదువుకున్న విద్యార్థులు, స్నేహితులు తీవ్ర సంతాపం వ్యక్త పరిచారు.



చలివేంద్రం వద్ద జనతాకిడి

రైతు బజారులో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ:ఎంవిపి కాలనీ రైతు బజార్లో వినియోగదారుల కమిటీ సభ్యులు వసంతరావు ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిక చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. రైతులకు వినియోగదారులకు ఎండతో సంభవించు దాహాన్ని తీర్చడానికి కౌంటర్ చాలా బాగా ఉపయోగపడుతుంది. రైతు బజార్‌కి వచ్చిన వారంతా కూడా ఈ కౌంటర్ వద్ద మజ్జిగ తాగి దాహాన్ని తీర్చుకున్నారు.

జనావాసాల మధ్య..

మరుగుదొడ్ల ఏర్పాటుపై ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు సమీపంలో ఉన్న గేటువలస గ్రామంలో జనావాసాల మధ్య మరుగుదొడ్లను ఏర్పాటు చెయ్యవద్దని ఆదివారం సచివాలయం వద్ద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ పాఠశాల మధ్యలో మరుగుదొడ్ల ఏర్పాటును తక్షణమే నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామం మధ్యలో ఏర్పాటు చేయడంతో ఆరోగ్య సమస్యలు కలుగుతాయని తెలిపారు.

పాలిటెక్నిక్‌లో వీనస్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-మాడుగుల:పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో మండల కేంద్రానికి చెందిన వీనస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు మెరుగైన ర్యాంకులతో అర్హత సాధించారు. దంగేటి పల్లవి(1253), కోన కావ్య శ్రీ (1552), బర్ల జయదేవ్ (2616), ద్వారపూడి పావని(4685) ర్యాంకులు సాధించారు.



పల్లవి | కోన కావ్య శ్రీ | జయదేవ్ | పావని

వీరు వీనస్ కోచింగ్ సెంటర్‌లో నిర్వాహకులు తాళపురెడ్డి నాగచంద్ర వద్ద శిక్షణ పొందారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హత సాధించినప్పటికీ ర్యాంకులు వారీగా వీనస్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలతో అగ్రస్థానంలో నిలిచారు.వీనస్ కోచింగ్ సెంటర్ లో శిక్షణ పొందిన విద్యార్థులు కొద్ది సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులతో అర్హత సాధిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా నాగచంద్రకు పలువురు అభినందనలు తెలిపారు.

ఇలాగైతే..జగనన్నకు చెప్పేది ఎలా?

- 1902 జగనన్నకు చెబుదాంకు ఫోన్ చేస్తే సవాలక్ష ప్రశ్నలు
- సమస్యలపై సచివాలయాల్లో సంప్రదించాలని సమాధానం
- గట్టిగా నిలదీసి అడిగితే కాల్ కట్ చేస్తున్న సిబ్బంది

జగనన్నకు చెబుదాం 1902

ప్రజాశక్తి-కోటవురట్ల:ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపడుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం పట్ల మండల వ్యాప్తంగా అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు సహా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. 1902 జగనన్నకు చెపుదాం కు చాలామంది ప్రజలు, బాధితులు పలు సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నా నిరాశే మిగులుతుందని ఆవేదన చెందుతున్నారు. మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణరాజు మండలంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు నిర్మాణం పట్ల ప్రధానంగా తడపర్తి రోడ్డుసహా పలు ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేశారు. పలువురు ప్రధానంగా హౌసింగ్, రెవెన్యూ సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో ఆశతో ఫిర్యాదు చేస్తున్నా వారికి నిరాశే ఎదురవుతోంది. 1902లో కాల్ సెంటర్ సిబ్బంది సమస్య పూర్తిగా విన్న తర్వాత సంబంధిత శాఖ అధికారులను కలిశారా? గతంలో స్పందనలో ఫిర్యాదు చేశారా అని, చేస్తే ఫిర్యాదు నెంబరు తెలపాలని, అన్ని విన్న తర్వాత త్వరలో మీ నెంబరుకు మెసేజ్ పంపుతామని సంబంధిత అధికారులు మిమ్మల్ని సంప్రదిస్తారని కాల్ సెంటర్ సిబ్బంది చెపుతున్నారు. అలాగే సచివాలయాల్లో సంప్రదించాలని సూచిస్తున్నారు. అక్కడ సమస్యలు అవ్వలేదని చెపితే సిబ్బందిని సంప్రదించాలని పదే పదే చెపుతున్నారు. చివరకు సిఎం జగన్ గారితో మాట్లాడాలని అనుకుంటున్నారని అని సిబ్బంది అడుగుతున్నారు. బాధితులు సరే అంటే సిఎంకు కాల్‌ను కనెక్టు చేస్తున్నారు. అనంతరం బీప్ మని శబ్దం వస్తుంది. సదరు సమస్యను ఒక్క నిమిషంలో చెప్పాలి. సమయం దాటితే కాల్ కట్ అవుతుంది. సిఎంకు చెపుదాం అంటే నేరుగా సిఎం మాట్లాడుతారని ఎంతో ఆశతో చేస్తున్న వారంతా నిరాశ చెందుతున్నారు. ఇలా అయితే ఈ కార్యక్రమం వల్ల ఉపయోగం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నాడు నేడు పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ - అధికారుల పనితీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతగిరి:మొదటి విడత నాడు నేడు పనులలో నాన్యత లోపం, ఆర్వోప్లాంట్ మూలకు చేరడం, విద్యా బోధనలో నిర్లక్ష్యం, పాఠశాల గదులు సరిగా లేక పోవ్వడంపై రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యాశాఖ అదికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ పర్యటనలో భాగంగా శనివారం అనంతగిరి మండలంలో పర్యటించి రాత్రి స్థానిక హరితహిల్ రెస్టారెంట్‌లో బస చేశారు. ఆదివారం చిలకలగెడ్డ ఎంపీపీఎస్ పాఠశాలలో నాడు నేను పనులను పరిశీలించారు. మొదటి విడతగా పాఠశాలలో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ పని చేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏర్పాటు చేయడమే కాదని పర్యవేక్షణ బాధ్యత అధికారులపై ఉందని మండిపడ్డారు. నాడు నేడు పనులలో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠ్య పుస్తకాల స్టాక్‌రూమ్‌ను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాలు లోటు లేకుండా విద్యార్థులకు అందజేయాలని డీఈవో, ఎంఈఓలకు సూచించారు. విద్యా కానుకలో బ్యాగులు,. బూట్లు, యూనిఫాంలో నాణ్యత లేకపోతే సహించేది లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. సింగిల్ స్కూల్ టీచర్స్ ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుడు అత్యవసర సమయంలో సెలవు పెట్టినప్పుడు సిఆర్పీలు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి బోదించాని ఆదేశించారు. చిలకలగెడ్డ గ్రామంలోని విద్యార్థుల ఇంటికి వెళ్లి ఐరన్ మాత్రలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహశిల్దార్ రాంబాయి, ఇన్‌చార్జీ ఎంపిడిఒ కుమార్ ఉన్నారు



అధికారులను ప్రశ్నిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్



ప్రవీణ్‌ప్రకాష్‌కు వినతిపత్రం ఇస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, సిపిఎం నేతలు

జెడ్‌పిటిసి గంగరాజు వినతి

అనంతగిరి: రాష్ట్రంలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న సిఆర్‌టిలు, బాష వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు అనంతగిరి జడ్పిటిసి దీసరి. గంగరాజు. సీపీఎం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి దీసరి. గంగరాజు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ సి.ఆర్.టిలు గత 20. సంవత్సరాలుగా పని చేస్తున్నారని, వీరిని రెగ్యులర్ చేయాలని కోరారు. సిఆర్.టిలు గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యకు ప్రతినిత్యం అందిస్తున్నారని తెలిపారు. వీరిని రెగ్యులర్ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మాతృభాష వాలంటీర్లు కొండ, ఒరియా, సవరా లో బోధిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేస్తున్నారని తెలిపారు.ప్రైమరీ పాఠశాలల తొలగింపును విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, సురేష్ పాల్గొన్నారు.

డుంబ్రిగూడ:మండలంలోని స్థానిక గవర్నమెంట్ హైస్కూల్లో శనివారం రాత్రి రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సందర్శించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గవర్నమెంట్ హైస్కూల్లో నిర్మిస్తున్న నాడు నేడు పనులను పరిశీలించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.